క్లుప్తంగా

మహిళా సాధికారితపై నేడు కార్యక్రమం

చిత్తూరు రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని రెవెన్యూ భవనంలో ఆదివారం మహిళా సాధికారిత –చైతన్య సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మన సంస్కృతి కళా సంస్థ నిర్వాహకుడు సహదేవనాయుడు తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కవులు, సాహితీవేత్తలు, రచయితలు, కళాభిమానులు పాల్గొనాలని కోరారు.

అకడమిక్ క్యాలెండర్‌ను అమలు చేయాలి


అంగన్‌వాడీ కార్యకర్తకు సూచనలిస్తున్న ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి

ఐరాల: అకడమిక్ క్యాలెండర్‌ను విధిగా అమలు చేయాలని ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని చిన్న వెంకలంపల్లె ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠ్యాంశాల వారీగా విద్యార్థుల సామర్థ్యాల్ని పరిశీలించారు. పాఠశాల రికార్డులను పక్కాగా నిర్వహించాలని, పాఠ్య ప్రణాళికలు రూపొందించుకుని బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు.

గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరి

గుడిపాల: గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని బొమ్మసముద్రం పశువైద్యాధికారి రవితేజ అన్నారు. శనివారం చింతగుంటూరు గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేశారు. పశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలను వేయించుకోవాలన్నారు. పశువులు వ్యాధుల బారిన పడకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కొందరు పాల దిగుబడి తగ్గుతుందని వేయించడం లేదని.. అవన్నీ అపోహలేనని తెలిపారు.

అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు


న్యాయవాది సుధాకర్

చిత్తూరు అర్బన్: కొందరు అక్రమ కేసులు పెట్టి తనను వేధిస్తున్నారని స్థానిక సంతపేటకు చెందిన లాయర్ సుధాకర్ ఆరోపించారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. 2012 నుంచి తాను నోటరీ లైసెన్స్ తీసుకుని సర్వీసు చేస్తున్నానన్నారు. మరో న్యాయవాది తమ్ముడు కళ్యాణ్ కుమార్ నోటరీ కాకపోయినా తన అన్న పేరుపై ఉన్న లైసెన్స్‌ను వాడుకుంటున్నాడని తెలిపారు. అతను తనతో అనవసరంగా ఘర్షణ పడుతూ, భౌతిక దాడులు చేస్తున్నాడని ఆరోపించారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశానన్నారు. తనపై దాడులు చేసి అక్రమ కేసులు పెడుతున్నారని, తనకు న్యాయం చేయాలని కోరారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఈవో వీరబ్రహ్మం

తిరుపతి అలిపిరి: తిరుపతి కోదండరామ స్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి 28 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఉత్సవాల పోస్టర్లు, బుక్‌లెట్లను శనివారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆవిష్కరించారు. ఆలయంలో 17న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 19న అంకురార్పణ నిర్వహించనున్నారు. 30 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు శ్రీరామ నవమి ఉత్సవాలు, ఏప్రిల్ 3 నుంచి 5వ తేదీ వరకు తెప్పోత్సవాలు జరగనున్నాయి. ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, పీఆర్వో టి.రవి, ఏపీఆర్వో పి.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

సేవే పరమావధి కావాలి

నగరి: న్యాయసేవలను ప్రజలకు చేరువ చేసేందుకే పారాలీగల్ వలంటీర్లను నియమించినట్లు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.విష్ణువర్మ తెలిపారు. శనివారం నూతనంగా ఎంపిక చేసిన పారాలీగల్ వలంటీర్లతో ఆయన సమావేశమయ్యారు. వారికి విధులు, బాధ్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, న్యాయ సేవలకు మధ్య వారధిగా పారా లీగల్ వలంటీర్లు పనిచేయాల్సి ఉంటుందన్నారు. జీతాలు ఉండవని సేవాభావంతో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పదవ తరగతి పాసై, ఎలాంటి వివాదాలు, సమస్యల్లో లేనివారినే పారాలీగల్ వలంటీర్లుగా నియమించినట్లు తెలిపారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.రామ శాంతి, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు స్వగృహ యోగం



గుడిపాలలో గృహప్రవేశానికి సిద్ధమైన ఇల్లు, వసంతాపురం లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

- ఉగాది నాటికి సామూహిక గృహప్రవేశాలకు ఏర్పాట్లు
- తుది మెరుగులు దిద్దుకుంటున్న ఇళ్లు
- చిత్తూరు నియోజకవర్గంలో 8 వేల ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

ఇళ్ల నిర్మాణాలు ఇవే..

మండలం	మంజూరైన ఇళ్లు	బీబీఎల్	బీఎల్	ఆర్ఎల్	ఆర్‌సీ	పూర్తయినవి
గుడిపాల	1450	170	294	98	222	608
చిత్తూరు(రూరల్)	1558	286	258	93	160	706
చిత్తూరు(అర్బన్)	5980	756	1647	435	373	1295

గుడిపాల: ప్రతి పేదవాడి సొంతింటి కళను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చుతోంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల నిర్మాణం చేపడుతోంది. ఉగాది రోజున సామూహిక గృహప్రవేశాలు చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇదివరకే గృహ నిర్మాణశాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. చిత్తూరు నియోజకవర్గంలో 8,988 వేల గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు 2,609 ఇళ్లు సిద్ధమయ్యాయి. ఇళ్లు పూర్తిచేసిన లబ్ధిదారులకు ఉచితంగా మీటర్లు కూడా ఇస్తున్నారు.

ప్రభుత్వం తోడ్పాటు:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతి ఇంటి నిర్మాణానికి రూ1.80 లక్షలు కేటాయిస్తోంది. పొదుపు సంఘాల నుంచి రూ.35 వేలు రుణంగా అందుతుంది. గుడిపాల మండలం వసంతాపురం లేఅవుట్‌లలో రోడ్లు, మంచినీరు, విద్యుత్ సౌకర్యం కోసం ప్రభుత్వం సుమారు రూ.15 లక్షలు ఖర్చు చేసింది. లబ్ధిదారలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

చురుగ్గా ఇళ్ల నిర్మాణాలు



ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలు చేసేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నాం. లబ్ధిదారులు కూడా సహకరిస్తున్నారు. ఇంతవరకు పనులు ప్రారంభించని లబ్ధిదారుల్లో చైతన్యం కల్పించి, పనులు ప్రారంభించేలా చేస్తున్నాం. అనుకున్న లక్ష్యాలు దిశగా పనులు చేస్తున్నాం. –గణేష్, గృహనిర్మాణశాఖ ఏఈ, గుడిపాల

చాలా సంతోషం



చాలా కాలంగా సొంతిల్లు లేదు. టీడీపీ హయాంలో ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. జగనన్న అధికారంలోకి వచ్చాక అర్జీ పెట్టుకున్న కొద్ది రోజులకే నాకు పట్టా ఇచ్చి ఇల్లు మంజూరు చేశారు. నాకు ఇచ్చిన జాగా విలువ రూ.5 లక్షలు చేస్తుంది. ప్రభుత్వం ఇచ్చిన సొమ్ముతో మరికొంత సొమ్మును వేసుకుని ఇంటిని నిర్మించుకున్నా. ఇల్లు లేదనే బాధ దూరమైంది. ఉగాది రోజున కొత్త ఇంటిలో గృహ ప్రవేశం చేయనున్నాం. –నీలావతి, వసంతాపురం

సీఎం పుణ్యమా అని ఇల్లు కట్టుకున్నాం



మాది తమిళనాడు రాష్ట్రం. 15 ఏళ్ల క్రితం గుడిపాలకు వచ్చి స్థిర పడ్డాం. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డ్ ఇక్కడే తీసుకున్నాం. గతంలో ఇల్లు కావాలని అర్జీలు పెట్టుకున్నా ఇవ్వలేదు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వచ్చాక ఇంటి పట్టా కావాలని అర్జీ పెట్టుకున్నాం. ఇంటి పట్టాతో పాటు ఇల్లు కట్టుకోవాలని అధికారులు చెప్పారు. రూ.1.80 లక్షలు ప్రభుత్వం ఇచ్చింది. ఇల్లు నిర్మించుకున్నాం. చాలా ఆనందంగా ఉంది. –రాజేశ్వరి, వసంతాపురం

ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు జన్మదిన వేడుకలు


ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బంగారుపాళెం: పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు జన్మదిన వేడుకలను బంగారుపాళెంలో ఆ పార్టీ నాయకులు, అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కేక్‌కట్ చేశారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీలు శిరీష్‌రెడ్డి, జయకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, ఏఎంసీ చైర్మన్ నారేసోమశేఖర్, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఈడిగ వడ్డెర, కురబ కార్పొరేషన్ డైరెక్టర్లు ఎల్లప్ప, మొగిలీశ్వర, అమరనాథ్, దొరస్వామి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు

చిత్తూరు కలెక్టరేట్: రానున్న రంజాన్ పండుగకు అన్ని ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగానికి ముస్లిం వక్ఫ్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్ కమిటీ అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఆదేశాలతో మైనారిటీ శాఖాధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారన్నారు. అన్ని మసీదులకు నీటి సరఫరా, మసీదు ఆవరణలో పారిశుద్ధ్య పనులకు మున్సిపల్‌శాఖ అధికారులను ఆదేశించారని చెప్పారు. మసీదు ఆవరణలోని హోటళ్లకు, పండ్ల దుకాణాలకు లేట్‌నైట్ పర్మిషన్ ఇవ్వాలని జిల్లా పోలీసులకు సూచించారన్నారు. కలెక్టర్, డీఆర్వో, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారికి కృతజ్ఞతలు తెలిపారు.

చిత్తూరులో శ్రీస్వరూపానంద సరస్వతి



విజయానందరెడ్డి, ఎమ్మెల్యే ఎంఎస్ బాబు దంపతులను ఆశీర్వదిస్తున్న శ్రీస్వరూపానంద సరస్వతి

చిత్తూరు రూరల్/యాదమరి: విశాఖ శ్రీశారదా పీఠాధిపతి శ్రీస్వరూపానంద సరస్వతి శనివారం చిత్తూరు నగరంలోని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి నివాసానికి వచ్చారు. ఆయనకు వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఎంఎస్ బాబు, విజయానందరెడ్డి కుటుంబాలను ఆశీర్వదించారు.

లైన్‌మన్ సేవలు వెలకట్టలేనివి


ఈఈ కార్యాలయంలో సంబరాలు చేసుకుంటున్న ఉద్యోగులు

- ట్రాన్స్‌కో ఇంచార్జి ఈఈ పద్మనాభపిళ్లై

చిత్తూరు కార్పొరేషన్: ఎండావాన లెక్కచేయకుండా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న లైన్‌మన్ సేవలు వెలకట్టలేనివని ట్రాన్స్‌కో అర్బన్ ఇన్‌చార్జి ఈఈ పద్మనాభపిళ్లై అన్నారు. లైన్‌మన్ దినోత్సవం సందర్భంగా శనివారం ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ కార్యాలయంలో నగర లైన్‌మన్ల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో డీఈఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, ఓసీ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రమౌళిపిళ్లై, ఏఈలు రాజా, బాలచంద్ర, నాయకులు యజ్ఞేశ్వరరావు పాల్గొన్నారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న చిద్విలాసం



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. తెల్లవారిజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవను కనుల పండువగా చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనంపై ఆసీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


జడ్జి కరుణకుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీవైఈఓ

చిత్తూరు కలెక్టరేట్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కరుణకుమార్ అన్నారు. శనివారం గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీ వెనుకబాటుతనాన్ని వెనక్కునెట్టి శాస్త్రీయతతో కూడిన సమానత్వం రావాలన్నారు. దానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు డీవైఈఓ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ హెచ్ఎం గ్లోరి పాల్గొన్నారు.

పది పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం


మాట్లాడుతున్న హెచ్ఎం దామోదరనాయుడు

పూతలపట్టు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంతశాతం ఉత్తీర్ణతే లక్ష్యమని పూతలపట్టు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం దామోదరనాయుడు అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. పిల్లలను మొబైల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచాలని.. ఇంటి దగ్గర చదివేలా చూడాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని.. అప్పుడే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు.

ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి

చిత్తూరు కార్పొరేషన్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ ఆధారిత యాప్‌లో ప్రతి రోజు అధికారులు, ఉద్యోగులు తప్పనిసరిగా హాజరు వేయాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ముఖ ఆధారిత హాజరు ఆధారంగా జీతాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

చెత్త సేకరణ యథావిధిగా జరగాలి


డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: పల్లెలో చెత్త సేకరణ యథావిధిగా జరగాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. పూతలపట్టు మండలం చిటిపిరాళ్ల పంచాయతీలోని డంపింగ్‌యార్డును శనివారం ఆమె తనిఖీ చేశారు. గ్రామంలో చెత్త సేకరణ ఎలా జరుగుతుందో..గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రీన్ అంబాసిడ్లకు పలు సూచనలు చేశారు. కచ్చితంగా ప్రతి రోజు చెత్త సేకరణ జరగాలన్నారు. సేకరించే చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించాలని సూచించారు. ఉత్పత్తి అయినా ఎరువును విక్రయించి పంచాయతీకి ఆదాయ వనరుగా మార్చుకోవాలన్నారు.

శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం


రామ్‌నగర్‌కాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. శనివారం స్థానిక రామ్‌నగర్‌కాలనీ, మురకంబట్టులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. విద్యావేత్త, సౌమ్యుడు అయిన శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ల నగర ఇన్‌చార్జ్‌లు కిరణ్, రాంగణేష్, మేయర్ అముద, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ రాహుల్‌రెడ్డి, కార్పొరేటర్లు సయ్యద్, పూర్ణ, సహదేవ్, నవీన్, జ్ఞానజగదీష్, చల్లాముత్తు, కృష్ణారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై దృష్టి సారించండి


సమస్యలు తెలుపుతున్న సభ్యులు

బంగారుపాళెం: వేసవిలో ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సభ్యులు అధికారులను కోరారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీపీ అమరావతి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా సమావేశంలో సభ్యులు తమ పంచాయతీల్లో సమస్యల గురించి ప్రస్తావిస్తే వాటిని నమోదు చేసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు సూచించారు. మండలంలోని రాగిమానుపెంట పంచాయతీలో చేతిబోరు మరమ్మతులు చేయాలని సర్పంచ్ శ్రీహరి కోరారు. తంబుగానిపల్లె, జేకొత్తూరు, బంగారుపాళెం ఇందిరమ్మ కాలనీలో తాగునీటి ట్యాంకు, వెలుతురుచేను పంచాయతీలోని కోలావారిఇండ్లు, పులిమడుగు గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లు భరతి, ఉమాదేవి, సుబ్రమణ్యం, ఎంపీటీసీ మొగిలిరెడ్డి ప్రస్తావించారు. మొగిలివారిపల్లె పంచాయతీ పాలమాకులపల్లెలోని లింగభద్రచెరువు దురాక్రమణకు గరవుతోందని.. చెరువును సర్వేచేయించాలని, గౌరీపురంలో తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి స్థలం చూపాలని సర్పంచ్ శ్రీనివాసులు కోరారు. బంగారుపాళెంకు శ్మశాన స్థలాన్ని మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ పామచంద్రారెడ్డి, వైఎస్ ఎంపీపీలు శిరీష్‌రెడ్డి, జయకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, మార్కెట్ కమిటీ, సింగిల్ విండో ఛైర్మన్లు నారే సోమశేఖర్, దత్తాత్రేయరెడ్డి, ఫిరోజ్ మహ్మద్, తహసీల్దార్ బెన్నురాజ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి శుద్ధీకరణ ప్లాంట్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరానికి శాశ్వత తాగునీటి సరఫరా పథకానికి సంబంధించిన డబ్ల్యూటీపీ (నీటి శుద్ధీకరణ ప్లాంట్) నిర్మాణ పనులను నగర కమిషనర్ జె అరుణ శనివారం పరిశీలించారు. పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి దామలచెరువు వద్దనున్న అడవిపల్లె రిజర్వాయర్, డబ్ల్యూటీపీ నిర్మాణ పనులను పరిశీలించారు. అమృత్ పథకంలో భాగంగా చిత్తూరు నగరానికి శాశ్వత తాగునీటిని సరఫరా కోసం రూ.271 కోట్లతో ఈ పనులు చేస్తున్నట్లు తెలిపారు. అడవిపల్లె రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ద్వారా నీటిని డబ్ల్యూటీపీకి సరఫరా చేసి.. శుద్ధి చేసిన తర్వాత పైప్‌లైన్ ద్వారా చిత్తూరు నగరానికి తీసుకొస్తారని చెప్పారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పబ్లిక్ హెల్త్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, డీపీహెచ్ఈఓ పుష్పగిరి నాయక్, ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు

- వైద్యాధికారి ధాత్రేయచౌదరి


వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికి వైద్యం అందించాలన్నదే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ లక్ష్యమని తవణంపల్లె మండల వైద్యాధికారి ధాత్రేయచౌదరి తెలిపారు. శనివారం మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ప్రతి ఒక్కరికి వైద్యం అందించాలనే లక్ష్యంలో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో డ్యూటీలు వేయడం దారుణం


వినతి పత్రం ఇస్తున్న ఏఎన్ఎంలు

యాదమరి: మండలంలోని ప్రభుత్వాస్పత్రిలో ఏఎన్ఎంలకు విధులు కేటాయించడం దారుణమని ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. యాదమరి ప్రభుత్వాస్పత్రిలో రెండు నెలల క్రితం స్టాఫ్ నర్సు పోస్టు ఖాళీ అయిందన్నారు. ఆ స్థానాన్ని భర్తీ చేయకుండా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఏఎన్ఎంలకు విధులు వేయడం దారుణమన్నారు. ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వహించడం వల్ల క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించలేకపోతున్నట్లు వాపోయారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సుల స్థానాలను భర్తీ చేయాలని కోరారు.